



**కథానిక**

యం. హీరాలాల్ రాయ్

ఎంత అవసరం లేదనుకొని వ్యతిరేకించినా, జీవితంలో రావలసిన విషమదశలు వస్తూనే వుంటాయి. ఈ దశలకు లోబడకుండా కొందరు తిరుగుబాటు జరపడానికి యత్నిస్తారు కాని జయం మాత్రం పొందలేరు. జీవితంలో మరోనగ్నసత్యం. గడిచిపోయిన దశ అలా గడిచి పోవలసిందేకాని ప్రాయశ్చిత్తం చేసుకునేదీ తిరుగుబాటు రేపేదీ తిరిగి మాత్రంరాదు.

అర్థంకాని కొన్ని కట్టుబాట్లలో అమాయికంగా చిక్కుకుని, నా బ్రతుకును నేనే చేతులారా వినాశనాని కర్పించుకున్నాను. ఆ నాటి నా ఆశయ సూత్రాలు ఈనాడు నన్ను ఘోరంగా పరిహసిస్తున్నాయి. ఇప్పుడు నేను నా అంతరాత్మముందు శిరస్సు వంచక తప్పడంలేదు. అంతకంటే నేను చేయగలిగింది కూడా యేమీ లేదిప్పుడు.... గతం జ్ఞప్తికి వచ్చి మనస్సులో తుపాను రేపుతూన్నది. నిత్యం మెదడుకి బలంగా తగిలే ముష్టిఘాతాలతో నా శిరస్సు అష్టవంకరలుతిరిగి సురిగిపోతూన్నది. ఒక్కసారి బావురుమని యేడవాలనిపిస్తున్నది.

* * *

పుట్టడమైతే నేనో దరిద్ర కుటుంబంలోనే పుట్టాను కాని, పెద్దయాక అనుకోకుండా పెన్నిధి లభించింది. ఎంతో కష్టంమీద నేను బి. ఏ.పూర్తి చేశానోలేదో, ప్రసిద్ధివహించిన ఒక ఆదర్శభాగ్యవంతుడి ఏకైక సంతానం నా భార్యకావడంతో నేను అదృష్టవంతుణ్ణిగా మారిపోయాను. నాభార్య 'రూప' ఆస్తిఅంతటికీ సర్వాధికారిణి కావడంతో నాక్కూడా ఆ ఆస్తిమీద అధికారం సంక్రమించినట్టే అయింది. అతిదరిద్ర దశలో జీవితం గడుపుతూ, ఎలాగో బి.ఏ. పూర్తిచేసుకున్న నవయువకుడికి అందమైన పెళ్ళాంతోపాటు అమితంగా ఆస్తిలభించడం పెన్నిధికాక మరేమిటి? ఇదంతానాకు లోకంలోవున్న ఒకే ఒక బంధువు, నా పినతల్లి సహాయసహకారాలతో లభించింది.

విద్యార్థిదశలో వున్నప్పుడు చదువు పూర్తి అయాక ఉద్యోగం కోసం యెందరి పంచలబట్టి ప్రార్థించాలోననీ, అయినా లభిస్తుందో లభించదో ననీ, ఒకవేళ దొరికినా అదో థర్డుగ్రేడ్ ఉద్యోగం మాత్రమే అవుతుందనీ, ఇలా ఆలోచిస్తూ అస్తమానం బాధపడుతూండేవాణ్ణి. జీవితంమీద నిరాశ జనించి ఏదేదో చేయాలనిపిస్తుండేది.

చిన్నప్పటినుంచీ సుఖం అనేది యేకోశానా అర్థంకాక, అతి దరిద్రవాతావరణంలో పెరిగి పెద్దవాణ్ణయాను. ఆరోజుల్లో, పెళ్ళి చేసుకోవడం అంటే నాకు పరమ అసహ్యంవేస్తూండేది. మనిషికి సంఘటించేఘోరప్రమాదాల్లో భార్య ఒకప్రమాదంగా నాదృష్టిలో పరిగణింపబడిన రోజులవి. ఎంతోమంది యువకులు పెళ్ళిళ్ళు చేసుకుని సరదాగా కొన్నాళ్ళుగడిపి, సంసారం పూర్తిగా విజృంభించాక. బిలబిలమంటూ గుంపెడుమంది పిల్లలూ, వాళ్ళందరికీ తిండిపెట్టాల్సిన బాధ్యత, భార్యాదేవత రుసరుసలూ మొదలైనవి భరించలేక మానసిక వ్యథనుంచి విముక్తి పొందుదామని ఆత్మహత్యలు చేసుకోవడం కళ్ళారా చూసిన నేను స్త్రీ కేవలం పిశాచరూపిణి అని అంటే నమ్మకుండా ఉండలేకపోయాను. పురుష జీవితానికి తగులుకున్న ఇనపవలలాంటిది స్త్రీశక్తి అనిపించేది.ఇవన్నీ తల్చుకుంటే ఆరోజుల్లో నా శరీరం కంపించి పోతుండేది. ఆ అభిప్రాయాలే అన్ని

దశల్లో నాలో జీర్ణించివున్నాయని నాకే తెలీదు.

అయాచితంగా, అదృష్టవశాత్తు ఒక ఆదర్శవంతమైన ఘరానా కుటుంబం పిల్లతో నా వివాహం జరిగిపోవడంవల్ల, విద్యార్థిదశలో నేను అలజడి పడ్డంతగా కష్టాలు నా అనుభవంలోకి రాలేదు. ఉద్యోగంకోసం గడప గడపనూ యాచించవలసిన దుర్గతికూడా పట్టలేదు. వాటినిగురించి ఆలోచించను కూడాలేదు.

మనిషి జీవితం 'తప్పులతడక'లాంటిది. లెక్కించడానికి కూడా వీల్లేనన్ని తప్పులుంటాయి దీంట్లో. చక్కని వెలుతురునుంచి విడివడి కటిక చీకట్లో బ్రతుకు గడపడానికి పోయేవాళ్ళని యెవరూ దోవకు మళ్ళించలేరు. అలాగే నేనూ మానవుల ఆశయాదర్శాలకు విరుద్ధంగా వెలుగుబాటలోంచి అంధకార మార్గంలో జొరబడ్డాను. అతి విచిత్రమైన కటికిచీకటి. ఇప్పటివరకూ నా హృదయం మూలమూలల్లోకూడా అదే చీకటి విహరిస్తున్నది. బహుశా మృత్యుపరిష్వంగంలోనే దీనినుంచి విడివడడం అనిపిస్తుంది. మనిషి నరనరాలలో జీర్ణించుకుని వున్న తత్వాన్ని కాదని త్రోసివేసుకుని బతకడం ఆత్మవంచనేగాక, అది ప్రమాదాలకు కూడాదారితీసి, మనిషి సహజతత్వాన్ని వికృతంగా మార్చి దుఃఖభాజనంచేసి, చివరికి ఏ రూపమూ లేకుండా ఎగిరిపోతుందని యీనాడనిపిస్తోంది.

పెళ్ళయిన కొన్నాళ్ళకి నా ప్రయత్నంమీదనే నేనో ఉద్యోగం సంపాదించాను. నేను ఉద్యోగం చేయడం మా మామగారికేమాత్రం యిష్టంలేదు. ఐనా, నా వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడంకోసం చేసితీరాలనుకున్నాను. ప్రవేశించాను.

మేము వుండే యిల్లు, రెండంతస్థుల అందమైన సౌధం. ఆ మేడముందు రకరకాల తీగలూ, పూలచెట్లూ లెక్కకుమించి వున్నాయి. ఆ యింటిని దూరంనుండి చూస్తే, యిల్లంతా పూలతో అలంకరింపబడినట్లుంటుంది. నా భార్య కూడా ప్రతిరోజూ, ఎన్నో రంగుల, వింతవూ లన్నిటినీ తృప్తిదీరా తలనిండా అలంకరించుకొని 'పూలరాణి'లా కనిపించేది. కాని, ఆ పూలన్నా ఆ తీగలన్నా నాకు విపరీతమైన అసహ్యం అనిపించేది. అవి ఏమాత్రం వాసనలేని వట్టి కాగితాల పూలలాంటివి. అతి కృత్రిమంగా, నా కళ్ళ కవి కనిపిస్తాయి. సువాసన లేకుండా అతి వెగటుగా కనిపించే ఆ కాగితాలపూలనూ తీగెలనూ అన్నిటినీ ఎక్కడివక్కడ నలిపి, కత్తిరించివేయాలనిపించింది.

నా అభిమాన మహాకవి 'వర్డ్స్‌వర్త్' మహాశయుడికి పూలమీద మహాపేక్ష వుండేదట. నిజంగా 'వర్డ్స్‌వర్త్' ప్రాణమిచ్చే పూలు అత్యంత సుగంధబంధురాలు కావచ్చు ననిపించేది. ఈ కాగితాల పూలే ఆనాడు ఆ మహాకవికి కనిపిస్తే నలిపి పారవేసేవాడేమో.

ఆ యింట్లో నన్ను ఒక్కడిని మినహాయిస్తే, మామగారికీ, నా భార్య రూపకూ రంగురంగుల పూలు, వాటి అందం ప్రధానంగాని, సువాసన విషయం వాళ్ళకి పట్టదు. అందుకే యెక్కడెక్కణ్ణించో తెప్పించి, రంగుల గుడ్డపీలికల్లాంటి యీ పూలన్నిటితో యిల్లు నింపేశారు. నాకుమాత్రం ఆ యింట్లో ఊపిరి తిరక్కపోయేది. వాళ్ళని చూసినా, ఆ పూలమీద వాళ్ళకుండే వెర్రి మమకారం చూసినా చెడ్డరోగం పట్టుకున్నట్లుండేది. ఒకోసారి మనస్సు భగ్గుమని తల తిరిగిపోతూండేది.

ఆ మేడ చుట్టూ, ఇంటి పక్క తోటలో సర్వత్రా వ్యాపించివున్న ఆ పూలనిగురించి ఒకోసారి నేను జాలి కూడా పడుతూండేవాణ్ణి. కొన్ని పూలకు మహా సుగంధాన్నిచ్చి,కొన్నిటిని బహిష్కరించినట్టు నిర్గంధ కుసుమాలుగా సృష్టించి, పక్షపాతాన్నీ, అన్యాయాన్నీ చేస్తున్నందుకు దేవుణ్ణి తిట్ట బుద్ధయేది.

రాత్రి సమయాల్లో, ఈ పూలల్లో మునిగి తేలుతూ శయనాగారంలో రూప ప్రవేశించగానే ఆ దౌర్భాగ్యపు పూలు నన్ను వెక్కిరిస్తున్నట్టనిపించేది. చికాకుతో నా తల తిరిగిపోయేది. కాని నేనేం చేయను?...రూపకు ఆ పూలంటే ప్రాణ సమానం. అవి లేనిదే ఆవిడ బతకలేదేమోననిపించేది. వాటిని చూస్తే నేను బతకలేనంత ఈర్ష్య నన్ను కాల్చుకు తింటుంది. ఆవిడ వాటిని ధరించడం మానదు. నే నావిడని అసహ్యించుకొనడం మానను. ఇలా చాలా రోజులు గడిచినవి. ఆ నిర్గంధ కుసుమాల కారణంగా 'రూప'కు నేను దినదినం దూరంకావడం ఎక్కువయింది... రూప ఆ పూలు పెట్టుకోవడం మానకపోవడంతో గతంలో, స్త్రీలనుగురించి నాకుగల అభిప్రాయం

పూర్తిగా వేళ్ళతన్ని బలపడిపోయింది. రాత్రిళ్ళు పడకగదిలో ఆవిడ నన్ను చీల్చుకతినే చూపులు చూస్తుంటే, దెబ్బతిన్న పక్షిలా గిలగిలా తన్నుకునేవాణ్ణి. నా హృదయాన్ని గ్రహించాలని ఆవిడ ఎంత ప్రయత్నించేదో నేనంత తిరస్కారం వ్యక్తం చేయడం మొదలైంది. శరీరాల వెచ్చదనం పరస్పరం కలుపుకోవడానికి ఆవిడ వాంఛిస్తే నేను అతి దురుసుగా ప్రవర్తించేవాణ్ణి. ఇంత జరుగుతున్నా యీ విషయాలు ఆవిడ తన తండ్రితో ఏనాడూ చెప్పి నామీద ఆరోపణలు చేయలేదు. ఆవిడ యీ సహనంతో నేనింకా నిర్లక్ష్యంగా ప్రవర్తించేవాణ్ణి. నాకు ఇష్టంలేనిపనిని ఆవిడ ఎందుకుచేస్తుందో అర్థం కాక అడిగితే ఆవిడ జాలిగా ఆపూలంటే తనకు ప్రాణంఅనేది. నామీదకన్నా పూలమీదే యెక్కువ ప్రేమా అంటే కన్నీళ్ళు రాల్చేది. కాని నాకోసం పూలను త్యజిస్తానని ఎన్నడూ అనలేదు. ఏమాత్రం సానుభూతి లేకుండా, ఆవిడతో నేను అసహ్యంగా మాట్లాడేవాణ్ణి.

స్త్రీ సహజమైన వాంఛను గొంతు నులిమి వేయడం రూపకి సాధ్యంకాకపోయేది. అలాగని నన్ను భయపెట్టీ, బాధించీ వశంచేసుకోవడానికెన్నడూ యత్నించలేదు. మర్యాదగా అభిజాత్య పద్ధతిలో, నామనసును మార్చి స్వాధీనం చేసుకోవాలని చూసేది. దినదినం ఆపట్టుదలచూసి నా కోపం ఉధృతం అవుతూవుండేది. ఒకోసారి నిర్దయగా, బలవంతంగా ఆవిణ్ణియెత్తి నేలమీద విడిచేవాణ్ణి...ఆవిడ జాలికళ్ళతో నా ముఖంవేపు చూస్తూ అలానే పడివుండేది. "నేను స్త్రీని; సహజంగా నాకుండాల్సిన వాంఛలు ఎలాతీరాలి...? నా హక్కునుంచి నన్నెందుకు వంచితురాల్ని చేస్తారు?" అని అడుగుతూన్నట్టుండేవా చూపులు. ఒకోసారి బహిరంగంగానే, "డబ్బుపెట్టి కొన్న బానిసమీదకూడా చేయరాని హింసను మీరు నామీద చేస్తున్నారు. మీకంత అసహ్యంగావుంటే ఒక్కసారే ఉరితీయరాదూ?" అంటూ కళ్ళవెంట నీళ్ళురాలుస్తూ కూర్చునేది.

మా పినతల్లి, దురాశతో నన్నో అపవిత్ర జీవితానికి ముడివేసిందని అస్తమానం నాకు బాధకలిగేది. హృదయంలో ఏదో అగ్ని చిప్పిలుతూండేది. చిన్నప్పటినించీ స్త్రీపైన నాకున్న అభిప్రాయం మరీ బలపడి రెక్కలు విప్పుకొందీ స్థితిలో. నేనో విచిత్రపరిస్థితికి లోనైపోయాను. ఆవిడ ఆపూలని ధరించడం మానదు. ధరించి నా వద్దకి రావడం అంతకన్నా మానదు. అటువంటి మొండిపట్టుదల ఆవిడలో యెందుకేర్పడిందో చెప్పదు. ఒకోసారి విపరీతమైన చికాకెత్తి, రూపను బలవంతంగా పట్టుకుని ఏమాత్రం దాక్షిణ్యం లేకుండా, అతిసుకుమారమైన ఆ కంఠాన్ని రెండుచేతుల్తో బలంగా నులిమివేయాలన్నంత ఉన్మత్తావేశం నాలో స్ఫురిస్తూవుండేది. కాని ఏదో అజ్ఞాతభయం నన్నువారించేది. ఈ దుర్భర పరిస్థితిలో, నా యౌవనవాంఛలు మృత్యుదేవత ఒడిలో నిద్రపోయినై. ఏడ్చి, ఏడ్చి వాచిపోయిన, రూప, అందమైన కళ్ళనిచూసినా 'జాలి' అనేది నాలో ఉద్భవించకపోయేది. మనస్సుకు ప్రశాంతాన్ని తెచ్చుకుందామని యేదన్నా వ్రాసుకోవడం మొదలెడితే, రూప అమాంతం నాచేతిలోని కాగితాలూ కలంలాక్కుని విసిరివేసి "అబ్బ! ఎలాగైతేం? పెద్ద కవీశ్వరులవుదామనుకున్నారు. ప్రపంచం అంతా నిశ్శబ్దంగా నిద్రించే యీ అర్ధరాత్రి... ...ఒకవైపు యౌవనాగ్నిలో ఒక ప్రేమైక హృదయం దహించుకపోతూవుంటే కనీసం మీకు సానుభూతికూడా లేదు." అని నిట్టూరుస్తుండేది.

ఈమాటలు విన్నప్పుడు మాత్రం నాకెలాగో అనిపించేది. ఆవిడ ప్రభావం నామీద అంతో యింతో పనిచేస్తూన్నదని అనుమానంవేసి, ఆవిడ ముఖంవైపు తదేకంగా చూస్తూంటే, క్షణానికో రకంగా అతి భయంకరంగా గోచరించి ఆజాలి తుడుచుకపోయేది. మనస్సు భయంతో కంపిస్తూంటే లేచి, పక్కనేవున్న తోటలోకి వెళ్ళిపోయేవాణ్ణి. నేను ఏవస్తువులనుతప్పించుకుని బయటపడ్డానో, మళ్ళీ అవే...ఆతోటనిండా అవేపూలు, నన్ను పరిహాసం చేస్తూన్నట్టనిపించేది. నాగుండెల్లో వెగటుదనం గోచరించేది. ఆ తోటంతా ధ్వంసం చేయాలనిపించేది...కాని, నేనెవర్ని? వేడిగా నిట్టూరుస్తూ, నా బ్రతుకిక శాశ్వతంగా యిలా నిట్టూర్పులు విడవవలసిందేనని భయంవేసేది.

ఒకనాటిరాత్రి: నిశ్శబ్దంగావున్న ఒక మారుమూల ప్రాంతంలో తోటలో ఆపూలని చూడ

కుండా తిరుగుతున్నాను పరధ్యానంగా; తలనిండా పూల నలంకరించుకుని "పువ్వులరాణి" వేషంలో రూప నాముందు ప్రత్యక్షమై విచిత్రంగా, జగుప్సాకరంగా నవ్వుతూ "ఒంటరిగా యీరాత్రి యిక్కడ నిలబడ్డారేం?" అంది. "వెన్నెలరాత్రి పూలు...ప్రకృతి...అన్నిటితో మీకు విరోధం గాదూ? ఇవేం పాపంచేశాయి చెప్పండి. సూటిగా నన్ను చూస్తూ అంది. నేనేమీ సమాధానం చెప్ప దల్చుకోలేదు.

"వీటిని ఉపయోగించుకోవడానికి బహుశా మీరే అనర్హులేమో"నంది సంకోచంగా. నాలో జ్వలనం రేగింది. ఆవిడ బలంగా నా చేయి పట్టుకుని నన్ను తనవేపు లాక్కుని "నిజం చెప్పండి! మీరెందుకు నాకు చోటివ్వరు... నన్ను అంధకారంలోకి దింపి మీరు దిగిపోతున్నారు. మీరు లేందే నేను జీవితంలో ఒంటరిగా అడుగు ముందుకు వేయలేను. వేయదల్చుకోలేదు...మీకేం తెలుసు నేను మిమ్మల్నెంత ప్రేమిస్తున్నానో?" అంది.

"ప్రేమ దానంతటదే యేర్పడాలిగాని కావాలని ప్రేమిస్తే రాదు" అన్నాన్నేను కఠోరంగా.

రూప కొంచెం గొంతుపెద్దదిచేసి ఇలా అంది: "అంత పట్టుదలా - అయిష్టం మీలో మూర్తీభవించి వున్నప్పుడు అసలు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు చెప్పండి! ఇప్పటివరకూ మీరుపెట్టిన హింసనంతా భరించాను. మీ కారణంగా నేనెంత మానసిక పీడకి గురైనానో దేవుడికే తెలుసు. పైగా, కనీసం మాట్లాడ్డంకూడా యిప్పుడు మానేశారు. నేనేంకాను చెప్పండి"అంటూ వెక్కి వెక్కి యేడ్వడం ప్రారంభించింది. ఆ అర్థరాత్రి నిశ్చలంగా తారకల కేసి చూస్తూ, నన్ను కాదన్నట్టుగా ఆ రోదనధ్వని చెవికేనా వేయకుండా నిలబడ్డాను. రూప యెప్పుడు వెళ్ళిపోయిందో నాకు తెలీదు.

మర్నాడు ఉదయం లేచి చూశాను.

పక్క మంచంమీద రూప శవం వికృతంగా పడివుంది. ఆవిడ చేతిలో చిక్కుపడివున్న చిన్న కాగితం ముక్కలో ఇలా రాసి వుంది:

"నేను వెళ్ళిపోతున్నాను. ఈ ప్రపంచంలో నాకుచెందినదంటూ యేమీ లేదు కాబట్టే వెళుతున్నాను. మిమ్మల్ని నేనెంత ప్రేమించానో మీకెప్పటికీ తెలీదు...ఎంతైనా నేను మీ హృదయందాకా చేరుకోలేకపోయాను. మీరు రెండో పెళ్ళిచేసుకుని, మళ్ళీ ఆ యిల్లాలి జీవితంకూడా దుఃఖభాజనం చేయకండి. మీరు తరవాత బాధపడకండి. ఇది నా తుది విజ్ఞప్తి. చిరకాలం ఇలాగే ఒంటరిగా సుఖంగా వర్ధిల్లండి. మీకు పూలంటే ఎందుకంత అసహ్యమో నా కర్థంకాదు. బతికుండగా నేను వాటిని విడిచిపెట్టలేక పోయాను... పూలేం చేశాయి చెప్పండి. పాపం...వాటి దేదోషం లేదు...మీరు వాటిని ద్వేషించడం పాపం... రూప..."

నాటినుంచీ నేటివరకూ నా జీవితం యెంత పరివర్తనకు గురయిందో నేను పోల్చుకో లేకపోతున్నాను. ఆ కలిగిన పరివర్తన మాత్రం విశుద్ధమైంది. అర్థంలేని వెర్రి మనస్తత్వానికి సంబంధించిందికాదు. గత జీవితంలోనికి దృష్టి సారించినప్పుడల్లా నా అస్తిత్వాన్ని నేను మరిచిపోతూంటాను. రూప అమాయికముఖం అందమైన కళ్ళతో నా కళ్ళల్లో సదా తిరుగుతూ వుంటుంది. ఆవిడ నా కోసం తోటలో నిరీక్షిస్తున్నట్టనిపిస్తుంది. ఆకళ్ళల్లో ఇంకా ఆనందం, అనురాగం తరంగాల్లా విజృంభిస్తూనే వుంటాయి. ఈ దృశ్యం నా ఆత్మను గజగజ వణికించి వేస్తుంది. రూప తుదికోరికప్రకారం నేను మళ్ళా పెళ్ళిచేసుకోలేదు. చేసుకోదల్చుకో లేదుకూడాను. ఈ అనంత విశ్వంలో, అనవరతం పరిభ్రమిస్తున్నాను. ఇప్పుడెక్కడన్నా వాసనలేని పూలు కనిపిస్తే ఆ పూలరేకల్లో 'రూప' ముఖం ప్రత్యక్షమౌతూ వుంటుంది. నన్నెవరో తరుముతూన్నంత భయంతో పరిగెడతాను. "నీవు క్రూరుడివి అమాయక జీవితాల్తో ఆడుకునే సైతానువు" అంటూ యెప్పుడూ నా వెనక ఎవరో అరుస్తూంటారు. కారుచీకటి తెరలు ఊపిరాడకుండా మనస్సుని దిట్టంగా బంధిస్తున్నాయి. ఏ ప్రాంతానికి వెడితే యీ చీకటి విడిపోతుంది?...నేనెక్కడ విశ్రమించాలి? మనశ్శాంతి కోసరం ఓ నెల రోజులు ఉద్యోగానికి సెలవుపెట్టి వెళ్ళిపోయాను. ఎక్కడ కెళ్ళినా రూపముఖం నా కళ్ళల్లో ప్రతిబింబిస్తూనే వుండిపోయింది. నాకు విశ్రాంతి కావాలి...ఎక్కడ లభిస్తుంది...? ★